సాక్షి నంద్యాల

ఆదివారం । 10 । నవంబర్ । 2024



పోటెత్తిన భక్తులు

బేతంచెర్ల: మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. మహిళలు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కార్తీక దీపాలు వెలిగించారు.



అట్టహాసంగా క్రీడాపోటీలు

సి.బెళగల్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శనివారం సెపక్‌తక్రా అండర్ – 17 బాల బాలికల రాష్ట్ర స్థాయి పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.

8లో ▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,631.93
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 101.500
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 8,567
అవుట్ ఫ్లో	: 10,016

న్యూస్‌రీల్

భక్తులతో కిక్కిరిసిన మహానంది



దర్శనం కోసం క్యూలైన్లలో ఉన్న భక్తజనం

మహానంది: కార్తీకమాసం, వీకెండ్ కావడంతో శనివారం మహానంది క్షేత్రం భక్తజనంతో పోటెత్తింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనం ఆర్జిత సేవాటికెట్ల ద్వారా కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లతోపాటు కోదండరామాలయం, వినాయకనంది, గరుడనంది ఆలయాలను సందర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

15న సామూహిక ఒడిబియ్యం

పాణ్యం: సంతాన సాఫల్యుడిగా పేరుగాంచిన కొత్తూరు గ్రామంలోని శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి సన్నిధిలో ఈనెల 15న సంతానం లేని వివాహితులకు సామూహిక ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు కంపమల్ల నాగపుల్లయ్య, వీరయ్యశర్మ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఆరేళ్లుగా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 8 గంటలకు ప్రత్యేక పూజల అనంతరం సామూహిక ఒడి బియ్యం కార్యక్రమం ఉంటుందన్నారు. సంతానం లేని వివాహితలు హాజరై ఒడిబియ్యాన్ని స్వీకరించాలన్నారు.

శ్రీశైలానికి నిలిచిన వరదనీరు

శ్రీశైలంప్రాజెక్ట్: ఎగువ జూరాల ప్రాజెక్ట్ నుంచి శ్రీశైలం జలాశయానికి విడుదలయ్యే వరద నీరు నిలిచిపోయింది. సుంకేసుల నుంచి మాత్రమే శనివారం సాయంత్రానికి 2,264 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. శుక్రవారం నుంచి శనివారం వరకు ఎగువ ప్రాజెక్ట్‌ల నుంచి 13,772 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు 54,812 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కుడిగట్టు కేంద్రంలో 11.806 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 7.498 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం జలాశయంలో 175.9226 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 877.50 అడుగులకు చేరుకుంది.

డ్రోన్ పరిశ్రమకు స్థల పరిశీలన

ఓర్వకల్లు: డ్రోన్ కెమెరాల తయారీ పరిశ్రమ కోసం డ్రోన్ ఫ్లైయింగ్ కార్పొరేషన్ సీఎండీ దినేష్‌కుమార్ స్థలాన్ని పరిశీలించారు. తహసీల్దార్ విద్యా సాగర్ ఆధ్వర్యంలో ఏపీఐఐసీకి కేటాయించిన భూముల్లో అనుకూలమైన స్థలం కోసం అన్వేశించారు. ఇందులో ప్రధానంగా పాలకొలను, చింతలపల్లె, సోమయాజులపల్లె, బ్రాహ్మణపల్లె, పూడిచెర్ల గ్రామాల రెవెన్యూ పరిధిలోని భూములను పరిశీలించారు. సుమారు 300 ఎకరాలలో డ్రోన్ పరిశ్రమను నెలకొల్పుతున్న నేపథ్యంలో అందుకు అనుకూలమై ప్రదేశాలను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇందులో పలు చోట్ల హైటెన్షన్ విద్యుత్ తీగలు రావడంతో ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని సూచించారు. నన్నూరు వద్ద గల ప్రభుత్వ భూములను పరిశీలించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయన వెంట ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ సందీప్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అడవిలో అమ్మప్రేమ!



పులి – ఆవు.. పాము – కాకి నీతి కథలు అందరికీ తెలిసే ఉంటాయి. కథల సారాంశం ఏదైనా.. అందులో తల్లి ప్రేమ కనిపిస్తుంది. మనుషుల్లోనే కాదు పశుపక్షాదుల్లో కూడా కమ్మనైన అమ్మతనం ఎంతో మధురం. తల్లి జంతువు ప్రేమ ముందు ఏ ప్రాణి అయినా, జీవి అయినా తలవంచక తప్పదు. తన కళ్లముందు తన బిడ్డకు కష్టం వస్తే తిరగబడి పోరాడుతుంది. ఇలాంటి దృశ్యాలు ఎక్కువగా అడవుల్లో కనిపిస్తాయి. అతి చిన్న ప్రాణి అయిన గిజిగాడు మొదలు అతి క్రూరమైన జంతువులుగా చెప్పుకునే పులి, చిరుత, ఎలుగుబంటి వంటి జంతువుల వరకు వాటి పిల్లల లాలన చూస్తే 'తల్లి ప్రేమ అడవంతా' అని అనకమానరు.

– ఆత్మకూరు రూరల్

- వన్య మృగాలలో కమ్మనైన అమ్మతనం
- పిల్లల దగ్గరకు వస్తే చీల్చి చెండాడే క్రూరత్వం
- మరికొన్ని జంతువులు, పక్షుల్లో అరుదైన మమకారం

పశుపక్షాదుల్లో తల్లి ప్రేమను దగ్గరిగా పరిశీలిస్తే కొన్ని ఆసక్తికర విషయాలు కనిపిస్తాయి. కోతి, పిల్లులు తమ పిల్లల పెంపకం అందరికీ తెలిసే ఉంటుంది. మాతృప్రేమలో మాత్రం మర్కటాలు మనుషులకే పాఠాలు చెబుతాయి. ఇక పిల్లి నిండు గర్భంతో ఉన్నప్పుడే తను ప్రసవించే ప్రదేశాన్ని ఎంచుకుని ప్రసవానంతరం కొంత సమయ వ్యత్యాసంతో పిల్లలను కనీసం ఏడు చోట్లకు మార్చడం దాని విశిష్ట లక్షణం. కీటకాలు, పక్షులు, జంతువుల్లో తల్లి ప్రేమ నిశితంగా పరిశీలిస్తే ఔరా.. అనాల్సిందే. నల్లమల అడవుల్లో పెద్దపులులు ప్రధాన రక్షిత జీవి. అంతరించి పోయే దశకు చేరుకుంటున్న వాటి సంతతిని పెంచి పోషించడంలో ఆడ పులులు ఒక యుద్ధమే చేస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. ప్రతి ఈతలోనూ రెండు నుంచి నాలుగు పిల్లలకు జన్మనిచ్చే ఆడపులి వాటిని పెంచడంతో ఎంతో క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కొంటుంది. పులి పిల్లలకు ప్రధాన ముప్పు మగపులుల నుంచే ఉంటుంది. సాధారణంగా పులి తన పిల్లలకు మూడేళ్ల వయస్సు దాటేంత వరకు అవి స్వయంగా తమ ఆహారం సంపాదించుకునే నైపుణ్యం పొందే వరకు తిరిగి సమాగానికి సిద్ధపడదు. అందుకే మగ పులులు ఈ పిల్లలను అడ్డు తొలగిస్తే ఆడపులితో సమాగానికి సిద్ధ పడవచ్చనే ధోరణే పులి పిల్లలకు ప్రమాదం తెచ్చి పెడుతుంది. అందుకే తన సంతానం సమీపంలోకి మగపులి రాకుండా ఆడపులి తరిమి కొడుతుంది. పులిపిల్లలకు మరో ప్రమాదం నక్క, తోడేలు, కొండ్రాసిగాడుగా పిలువబడే దొమ్మలగొండి (హైనా)వంటి స్కావెంజర్ జంతువుల నుంచి కూడా పొంచి ఉంటుంది. తల్లి పులి ఆహారం కోసం వెళ్లినప్పుడు ఈ జంతువులు పులి పిల్లలకు హాని కలిగిస్తాయి. అందుకే తల్లి పులి తన పిల్లలను గుహల్లో, చెట్టు బొరియల్లో ఉంచి వాటి ఉనికి బయటకు తెలియనంతగా జాగ్రత్త పడుతుంది. ఆహార సేకరణ కోసం పెద్దగా పిల్లలను విడిచి దూరం వెళ్లదు. పిల్లలు కాస్త తిరుగాడే వయస్సు వచ్చినపుడు వాటిని వెంట పెట్టుకునే వేటకు ఉపక్రమిస్తుంది. అప్పుడు పులి పిల్లలు మొదట తల్లి చేసే వేట పద్ధతులను పరిశీలిస్తూ మెల్లమెల్లగా వేటాడేందుకు సిద్ధమవుతాయి.


సండే స్పెషల్



ఆహారం భద్రపరిచి.. కూనల కడుపు నింపి

పిల్లి కుటుంబానికే చెందిన చిరుతపులి (లెపర్డ్) కూడా రెండు నుంచి మూడు పిల్లలను పెడుతుంది. ఇది కూడా పెద్దపులిలాగే పిల్లల కోసం అత్యంత అప్రమత్తంగా సంచరిస్తుంది. పిల్లి జాతిలో పిల్లి తరువాత చెట్టు ఎక్కగలిగే సామర్థ్యం ఉన్న ఏకైక పులి చిరుత మాత్రమే. ఈ ప్రత్యేకతను తన పిల్లలకు ఆహారం దాచి పెట్టే విషయంలో ఉపయోగించుకుంటుంది. పిల్లలను భద్రమైన చోట దాచి వేటకు వెళ్లి తాను చంపి తెచ్చిన వేట జంతువు కళేబరాన్ని పిల్లల ముందు ఆహారంగా వేస్తుంది. అవి తినగా మిగిలిన భాగాన్ని చెట్టు కొమ్మపై భద్రపరచి మరుసటి రోజు మళ్లీ ఆకలిగొన్న పిల్లలకు పెడుతుంది.

అంతా.. ఏకాంతం..



ఎత్తైన, ముదిరిన వృక్షాల కాండాలపై సహజంగా ఏర్పడ్డ తొర్రలను ఆడ హార్న్‌బిల్ గూడుగా ఎంపిక చేసుకుంటుంది. వయస్సు కొచ్చిన మగపక్షి తనతో జతగట్టేందుకు అంగీకరించిన ఆడపక్షితో కలసి ఇలాంటి తొర్రల్లో ప్రవేశిస్తుంది. ఆపై ఆడ పక్షి తొర్ర ప్రవేశ మార్గాన్ని చెట్ల బెరళ్లు, కర్ర పుల్లలు, బంక మట్టితో కలిపి మూసివేస్తుంది. గాలి చొరబడేందుకు మాత్రం చిన్న రంధ్రాన్ని మాత్రం ఉంచుకుంటుంది. సమాగమనంతరం మగ పక్షి మూసిన ప్రవేశ మార్గాన్ని తిరిగి తెరుచుకుని బయటకు వస్తుంది. ఆడపక్షి మాత్రం గుడ్లు పెట్టి వాటిని పొదిగి పిల్లలను చేసే వరకు గూటిలోనే జైలు జీవితం గడుపుతుంది. మూసివేయబడిన తొర్ర ప్రవేశ మార్గానికి ఏర్పరచిన చిన్నపాటి రంధ్రం ద్వారానే ఆడపక్షికి.. మగపక్షి ఆహారాన్ని అందిస్తుంది. అనంతరం ఆడపక్షి గూటి వెలుపలికి వచ్చి పిల్లలున్న గూటిని తిరిగి మూసివేస్తుంది. ఆ తరువాత పక్షి దంపతులు కలసి పిల్లల పోషణ భారం వహిస్తాయి. పిల్లలకు రెక్కలొచ్చి గాలిలో ఎగిరే వరకు ఈ తరహా రక్షణలోనే వాటి పోషణ సాగుతుంది.



నీ ప్రేమ భల్లూకం గాను..


వన్యప్రాణుల్లో తల్లులన్నింటిలోను ఎలుగుబంటి అమితమైన ప్రత్యేక శైలి కలిగినది. ఆడ ఎలుగుబంటి తన పిల్లలను వాటికి వేగంగా పరిగెత్తగల వయస్సు వచ్చే వరకు తన మూపున మోసుకుని తిరుగుతూ ఉంటుంది. పుట్టలు తవ్వి చెదపురుగులను, చెట్టు ఎక్కి తేనె పట్టును తెచ్చి పిల్లలకు పెడుతూ ఎంతో ప్రేమ పూర్వకంగా పిల్లలను సాకుతుంది. పిల్లలున్న ఎలుగు బంటి మరింత క్రోధంతో సమీపంలోకి వచ్చే జంతువును, మనిషిని చీల్చి చెండాడుతుంది.

➤ నల్లమలలోని హనీబాడ్జర్ నేల బొరియలలో నివాసం ఏర్పాటు చేసుకుంటుంది. తమ పిల్లలు ఇతర జంతువుల బారిన పడకుండా బొరియలో ప్రత్యేక గదులు తవ్వుకుని రక్షణ కల్పిస్తాయి.



➤ గిజిగాడు పక్షి అందమైన గూళ్లను అత్యంత భద్రమైన ప్రదేశాలలో(చిటారు కొమ్మలకు నీటి తలం అంచున)కట్టి అందులో గుడ్లను పొదిగి పిల్లలకు నిరంతరం కీటకాలను, ధాన్యం గింజలను ఆహారంగా అందించి పెంచుతుంది.

➤ కందిరీగలు వివిధ కీటకాల లార్వాలను తీసుకు వచ్చి గూడులో ఉన్న పిల్లలకు ఆహారంగా పెడతాయి.



➤ తేనె టీగలు తెట్టెలో షడ్భుజాకారంలో ఉండే గదుల్లో ఉండే పిల్ల ఈగలకు అవి సేకరించిన మకరందాన్ని ఆహారంగా అందిస్తాయి.

➤ రేచుకుక్కలు (వైల్డ్ డాగ్స్) వేట జంతువులను చంపి మాంసాన్ని కడుపులో నిల్వ చేసుకుని తమ పిల్లల వద్దకు వెళ్లి వాటి ముందు మాంస కండలను కక్కి తినిపిస్తాయి.

రాష్ట్రస్థాయి అవార్డులకు ఐదుగురు జిల్లా ఉపాధ్యాయులు



సత్యప్రకాష్ | ప్రేమ్‌కాంత్‌బాబు | సత్యనారాయణ | మేరి | సురేష్‌బాబు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లాకు చెందిన ఐదుగురు ఎంపికైనట్లు డీఈఓ జనార్దన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెలుగోడు జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయుడు సత్యనారాయణ, డోన్ తొగట సురేష్‌బాబు, ఎర్రగుంట్ల మేరితోపాటు పుసులూరు ఎంపీయూపీ పాఠశాల ప్రేమ్‌కాంతుబాబు, బనగానపల్లె ఎంపీపీ స్కూల్ సత్యప్రకాష్‌లు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారన్నారు. వీరిని ఈనెల 11న విజయవాడలో నిర్వహించనున్న కార్యక్రమంలో అవార్డులతో సన్మానించనున్నట్లు పేర్కొన్నారు.

భక్తులకు ఇబ్బందులు కలిగితే బాధ్యులపై చర్యలు



క్యూలైన్లను పరిశీలిస్తున్న ఈఓ శ్రీనివాసరెడ్డి

మహానంది: కార్తీకమాసంలో ఆది, సోమవారాల్లో మహానందీశ్వర స్వామి దర్శనార్థం వచ్చే భక్తుల సంఖ్య మరింత పెరుగుతుందని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మహానంది ఈవో నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మహానందిలో శనివారం ఉచిత దర్శనం క్యూ లైన్లను పరిశీలించారు. ఆలయ ఏఈఓ ఎరమల మధు, పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, ఏఈ శ్రీనివాసులుతో కలిసి ఉత్తరద్వారం వైపు ఏర్పాటు చేసిన క్యూలైన్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. క్యూలైన్ల వెంట వెలుగులు వచ్చేలా బల్బులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ఆనందంగా వెళ్లేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, భక్తుల నుంచి ఫిర్యాదులు అందితే బాధ్యులపై కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్తీక పౌర్ణమికి వేలాది సంఖ్యలో భక్తులు వస్తారని, క్యూలైన్లలో తొక్కిసలాటకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు.

కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే ప్రజలే తిరగబడతారు

- వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు
- అక్రమ కేసులు ఆపాలంటూ జిల్లా అడిషనల్ ఎస్పీకి వినతి పత్రం అందజేత



ఏఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మాజీ ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల: కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే ప్రజలే తిరగబడతారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి హెచ్చరించారు. తమ పార్టీ సోషల్ మీడియా నాయకులు, కార్యకర్తలపై నాలుగు రోజులుగా చేస్తున్న అక్రమ కేసులు, అరెస్ట్‌లను ఆపాలని మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, నాయకులు సూర్యనారాయణరెడ్డి, కల్లూరి రామలింగారెడ్డి, యూనస్, శిల్పా భువనేశ్వరరెడ్డి, శివశంకర్‌లతో కలిసి ఆయన శనివారం అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబుకు ఎస్పీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం రాంభూపాల్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కొందరు పోలీసులు అధికారంలో ఉన్న వారికి ఒక విధంగా, ప్రతిపక్షంలో ఉన్న వారికి ఒక విధంగా న్యాయం చేస్తున్నారని, ఇలాంటి వాటిని పోలీసు అధికారులు అరికట్టాలని కోరారు. నాలుగు రోజులుగా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా నాయకులు, కార్యకర్తలపై అన్యాయంగా కేసులు పెట్టి చిత్రహింసలకు గురి చేసి వేధిస్తున్నారన్నారు. శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ బొల్లవరం గ్రామానికి చెందిన కృష్ణ ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన వార్తను ఫార్వర్డ్ చేశారని కేసు పెట్టి అరెస్ట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. శ్రీశైలం నియోజకవర్గంలో వైన్‌షాపులు నడుపుకోవాలంటే ఎమ్మెల్యేకు 30 శాతం కమీషన్ లేదా నెలకు రూ.2 లక్షలు డిమాండ్ చేస్తుండటం సిగ్గుచేటన్నారు. గంగుల బిజేంద్రారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. ఆళ్లగడ్డలో కోళ్ల వ్యాపారం చేసుకోవాలన్నా స్థానిక ఎమ్మెల్యేకు డబ్బు ఇచ్చుకోవాల్సిన దుస్థితి ఉందన్నారు. కమీషన్ రూపంలో లక్షలాది రూపాయలు టీడీపీ నాయకులు తీసుకుంటున్నారని, ప్రజలు ఏమనుకుంటారోనన్న సోయ కూడా వారికి లేదన్నారు. అహోబిలంలో తలనీలాలు, టెంకాయలు తదితర టెండర్లలో ఇతరులెవరూ పాల్గొనకుండా గతంలో వేసిన టెండర్ల కంటే తక్కువకే దక్కించుకుని దేవుడికే శఠగోపం పెడుతున్నారన్నారు. సనాతన ధర్మం పాటిస్తానని చెబుతున్న పవన్‌కల్యాణ్ ఒక్కసారి అహోబిలం వచ్చి కూటమి నాయకుల అరాచకాలను పరిశీలించాలన్నారు. పోచా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియాలో మహిళలను అవమానించేలా టీడీపీ నాయకులు, కార్యకర్తలే పోస్టులు పెడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలపై టార్గెట్ చేసి కేసులు పెట్టడం అన్యాయమన్నారు. ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మాట్లాడుతూ కూటమి నాయకులు వైఎస్సార్‌సీపీ, సోషల్ మీడియా కార్యకర్తలు, నాయకులపై కేసులు పెట్టి భయపెట్టాలనే చూస్తున్నారని, వాటికి ఎప్పటికీ తాము భయపడేది లేదన్నారు.

ఉపాధికి పాతర.. అక్రమాల జాతర!

- జిల్లాలో 130 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించిన కూటమి సర్కార్
- బినామీ మస్టర్లతో ఉపాధి నిధుల స్వాహాకు రంగం సిద్ధం

కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు చేతినిండా పని కల్పించి రోజుకు రూ.272 సగటు వేతనం అందేలా చర్యలు తీసుకుంది. పథకంలో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా 2017లో జన్‌మన్‌రేగా యాప్‌ను రూపొందించింది. కానీ ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చీరాగానే ఉపాధి పథకాన్ని నీరుగార్చేందుకు చర్యలు తీసుకుంది. పెద్ద ఎత్తున ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి అక్రమాలకు తెరలేపింది.

– కోవెలకుంట్ల



కోవెలకుంట్ల సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

జిల్లాలోని 29 మండలాల పరిధిలో 489 గ్రామ పంచాయతీలు ఉండగా 4.31 లక్షల జాబ్ కార్డులున్నాయి. ఇందులో 2.16 లక్షల యాక్టివ్ జాబ్‌కార్డుల్లోని 3.94 లక్షల మంది కూలీలు ఏటా ఉపాధి పనులకు వెళ్తున్నారు. కూటమి సర్కార్ వచ్చిన వెంటనే జిల్లావ్యాప్తంగా 130 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి తమకు అనుకూలమైన వారిని నియమించుకుంది. ఇక యాప్‌పై కూడా అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తుండటంతో ఉపాధిలో అక్రమాలు చోటు చేసుకునే ఆస్కారం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. యాప్‌పై సరైన అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటే ఉపాధి కూలీల చేతిలో బ్రహ్మాస్త్రం అవుతుంది.

యాప్‌తో ప్రయోజనాలు

2017 సంవత్సరానికి ముందు ఉపాధి కూలీల వేతనాలు ఏ బ్యాంకులో జమ అయ్యాయో, పనికి వెళ్లిన రోజు హాజరు నమోదైందో లేదో తెలుసుకునేందుకు కూలీలు ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరిగాల్సి వచ్చేది. కూలీల వ్యయ ప్రయాసలు తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త యాప్‌ను రూపొందించి కూలీల కష్టాలు, అక్రమాలకు చెక్ పెట్టింది. హాజరు మొదలుకుని వేతనాలు ఏ బ్యాంకు ఖాతాలో పడ్డాయో, పెండింగ్ వేతనాల వివరాలను ఈ యాప్ ద్వారా కూలీలే స్వయంగా తెలుసుకునే అవకాశం కల్పించింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జన్‌మన్‌రేగా యాప్ వినియోగంపై క్షేత్రస్థాయిలో కూలీలకు విస్తృత అవగాహన కల్పించి ఉపాధి పథకంలో అక్రమాలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టింది. సెల్‌ఫోన్‌లోని గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి జన్‌మన్‌రేగా అని టైప్‌చేసి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో కూలీల వివరాలు, హాజరు, వేతనాలు, తదితర వివరాలు క్లిక్‌చేస్తే బ్లాగ్ తెరుచుకుంటుంది. అందులో ఉపాధి జాబ్ కార్డు సంఖ్య నమోదు చేసి క్లిక్‌చేస్తే వివరాలు వస్తాయి. కూలీపేరుపై క్లిక్ చేయగానే పనిచేసిన రోజులు, వేతన బకాయిలు ఏ బ్యాంకు ఖాతాలో నగదు జమ అయిందో తదితర వివరాలు స్పష్టంగా తెలుసుకోవచ్చు. వేతనం జమ కాకపోతే ఎందుకు జమ కాలేదో కూడా గుర్తించేలా యాప్‌లో వివరాలను పొందుపరిచారు. ఉపాధి పథకం ద్వారా చేపట్టే పనుల సమాచారం ఇందులో ఉంటుంది.

అక్రమాలకు చెక్

యాప్‌ను సమర్థవంతంగా వినియోగించుకుంటే పథకంలో చోటుచేసుకునే అక్రమాలకు చెక్‌పెట్టవచ్చు. కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలు పనులకు రాకపోయినా వచ్చినట్లు బోగస్ మస్టర్లు వేసి ఆయా గ్రూపుల్లోని కొందరు కూలీల కడుపు కొట్టేందుకు సిద్ధమవుతున్నారు. బోగస్ హాజరుతో వచ్చిన మొత్తాన్ని ఆయా గ్రామాల టీడీపీ నాయకులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు వాటాలు పంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బోగస్‌మస్టర్ల వ్యవహారం సామాజిక తనిఖీల్లో మాత్రమే వెలుగు చూసే అవకాశం ఉంది. ఇలాంటి తరుణంలో అక్రమాలు చెక్ పెట్టేందుకు జన్‌మన్‌రేగా యాప్ అందుబాటులో ఉంది. కూలీలసొమ్ము స్వాహాతోపాటు ఇతర అక్రమాలపై ఫిర్యాదు చేసే వెసులుబాటు యాప్‌లో ఉంది. పని ప్రదేశాల్లో కూలీలతో కాకుండా యంత్రాలతో పనిచేసినా, బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేసినా, నిధులు దుర్వినియోగం చేసి దొంగమస్టర్లకు పాల్పడినా యాప్‌లో ఫిర్యాదు చేస్తే నేరుగా కేంద్ర ప్రభుత్వం దృష్టికి వెళ్తుంది. అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తారు. కూటమి ప్రభుత్వం యాప్‌పై అవగాహన కల్పించకపోవడంతో కూలీలకు అందించే వేతనాల్లో అక్రమాలు చోటు చేసుకుంటాయని వేతనాల్లో కోత పడుతుందని ఉపాధి కూలీలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు ఉపాధి కూలీలకు యాప్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి అక్రమాలకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జన్‌మన్‌రేగా యాప్‌పై కూలీలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లకు యాప్ వినియోగంపై శిక్షణ ఇచ్చి ప్రతి శుక్రవారం జరిగే రోజుగారి దివస్ కార్యక్రమంలో చదువుకున్న మేటీలకు సెల్‌ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్, వినియోగం, తదితర అంశాలపై తెలియజేసి కూలీలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. స్మార్ట్‌ఫోన్ ఉన్న ఉపాధి కూలీలు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకుంటే అక్రమాలకు తావుండదు.

– సాంబశివరావు, ఏపీడీ, కోవెలకుంట్ల

మద్దిలేటయ్యకు రూ.3.93 లక్షల ఆదాయం

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం శివారులో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన లక్ష్మీమద్దిలేటి నరసింహస్వామి ఆలయానికి కార్తీక మాసం శనివారం సందర్భంగా స్వామి, అమ్మవార్ల దర్శనార్థం తరలి వచ్చిన భక్తుల సేవల ద్వారా రూ.3,93,460 ఆదాయం వచ్చినట్లు అసిస్టెంట్ కమిషనర్, ఈఓ రామాంజనేయులు తెలిపారు. ఆలయ సందర్శనకు వచ్చిన భక్తులకు నామధారణతోపాటు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

క్లుప్తంగా

యాగంటి క్షేత్రానికి ఎల్‌ఈడీ లైట్ల విరాళం



ఈఓకు ఎల్‌ఈడీ లైట్లు అందజేస్తున్న ఫ్యాక్టరీ యాజమాన్యం

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రానికి యనకండ్ల గ్రామ సమీపంలో ఉన్న మైహోం సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం రూ.2.40 లక్షల విలువ చేసే ఎల్‌ఈడీ లైట్లను ఆలయ ఈఓ చంద్రుడుకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మైహోం సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ఆలయ ఆవరణంలో వీధిదీపాల ఏర్పాటుకు 40 ఎల్‌ఏఈడీ లైట్లను అందజేశామన్నారు. కార్యక్రమంలో మైహోం సంస్థ యాజమాన్యం గుర్రెడ్డి, శివప్రసాద్, అర్చకులు మహేష్‌శర్మ, బండి బ్రహ్మానందరెడ్డి ఉన్నారు.

జిల్లాలో ముగ్గురికి నామినేటెట్ పదవులు

కర్నూలు న్యూసిటీ: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు చెందిన ముగ్గురిని నామినేటెడ్ పోస్టుల్లో నియమించింది. కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఏపీ కురుబ, కురుమ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆదోని నియోజకవర్గానికి చెందిన దేవేంద్రప్ప, ఏపీ వాల్మీకి–బోయ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా కపట్రాల సుశీలమ్మ (బొజ్జమ్మ)ను నియమించింది. ఇదిలా ఉండగా గతంలో ఒక చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో బొజ్జమ్మ తాము బోయ, వాల్మీకి కులానికి చెందిన వారము కాదని, తాము ఏకీ నాయుళ్లమని చెప్పడం గమనార్హం.

యువకుడి ఆత్మహత్య



శ్రీధర్ ఆచారి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, బంధువులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం–హెచ్ కొట్టాల గ్రామాల మధ్య రైల్వే ట్రాక్‌పై గూడ్స్ రైలు కింద పడి ఓ యువకుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఓర్వకల్లు మండలం గుట్టపాడు గ్రామానికి చెందిన వెంకటరామయ్య ఆచారి, ఇందిరావతమ్మ కుమారుడు శ్రీధర్ ఆచారి (20) బేతంచెర్లలో కార్పెంటర్ వర్క్ చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. శనివారం ఉదయం పనికి వెళ్తున్నాని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. ఆ తర్వాత రైల్వే ట్రాక్‌పై గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకొని రోదించారు. గతంలో పెద్ద కుమారుడు లోకేష్ ఆచారి అనారోగ్యంతో మృతిచెందగా.. చిన్న కుమారుడు ఆత్మ హత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు విలపించిన తీరు పలువురిని కంట తడి పెట్టించాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న రైల్వే పోలీసులు తెలిపారు.

అట్టహాసంగా సెపక్‌తక్రా పోటీలు



మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తున్న కర్నూలు క్రీడాకారులు



సెపక్‌తక్రా పోటీల్లో తలపడిన క్రీడాకారులు

- రాష్ట్ర నలుమూలల నుంచి 120 మంది క్రీడాకారులు హాజరు
- తొలి రోజు పోటీల్లో సత్తాచాటిన పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల జట్లు

సి.బెళగల్: సెపక్‌తక్రా అండర్ – 17 రాష్ట్ర స్థాయి బాల, బాలికల క్రీడాపోటీలు సి. బెళగల్ గురుకుల పాఠశాలలో శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరిగే ఈపోటీలకు వివిధ జిల్లాల నుంచి 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. తొలి రోజు పోటీలను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బలరాముడు ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని, శారీరక ధారుడ్యాన్ని ఇస్తాయన్నారు. అంతేకాకుండా క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. మొదటి రోజు శనివారం లీగ్ పోటీలు, క్వాటర్ ఫైనల్, బాలుర సెమీ ఫైనల్ పోటీలు నిర్వహించినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సుంకరావు, పాఠశాల పీడీ రాఘవేంద్ర తెలిపారు.

ఫైనల్ చేరిన పశ్చిమగోదావరి,కృష్ణా జట్లు

బాలుర విభాగంలో జరిగిన ప్రారంభం పోటీల్లో పశ్చిమగోదావరి, అనంతపురం, కృష్ణా జిల్లా, విశాఖపట్నం జట్లు సత్తాచాటాయి. తర్వాత వాటిలోని పశ్చిమగోదావరి, అనంతపురం జట్ల మధ్య తొలి సెమీఫైనల్ నిర్వహించగా పశ్చిమగోదావరి జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. రెండో సెమీ ఫైనల్లో పోటీపడిన కృష్ణా, విశాఖపట్నం జట్లలో కృష్ణా జిల్లా గెలుపొంది రెండో జట్టుగా ఫైనల్‌కు చేరుకుంది. అలాగే బాలికల విభాగంలో తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, అనంతపురం, కృష్ణా జిల్లాల జట్లు సెమీ ఫైనల్ చేరాయి. నేడు బాలికల సెమీ ఫైనల్, బాలుర ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ పోటీల నిర్వహణ పరిశీలకులు రమేష్, వివిధ పాఠశాలల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు

వైఎస్సార్‌సీపీ హయాంలోనే వాల్మీకి గుహల అభివృద్ధి

- రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బుగ్గన అర్జున్ అమర్‌నాథ్‌రెడ్డి



వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

డోన్: వాల్మీకి గుహలను వెలికితీసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనేనని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బుగ్గన అర్జున్ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం వారు నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్యాపిలి మండలం బోయవాండ్లపల్లె సమీపంలోని వాల్మీకి గుహలను సందర్శించారు. వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బేతంచెర్ల మండలం ఎర్ర జ్వాల బిల్లల స్వర్గం, ప్యాపిలి మండలం వాల్మీకి గుహలను బాహ్య ప్రపంచానికి తెలియజేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. 50 ఏళ్ల చరిత్రలో జరగని అభివృద్ధిని ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కేవలం 5 ఏళ్లలో సాధించారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో రాష్ట్రంలోని డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అభివృద్ధిని గాలికొదిలి వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసులు నమోదు చేయడమే లక్ష్యంగా పాలన సాగిస్తోందన్నారు. అయినా ఎవరూ భయపడవద్దని, తాము అండగా ఉంటామని, త్వరలోనే మంచి రోజులు వస్తాయని ధైర్యం చెప్పారు. అనంతరం ఇటీవల మృతిచెందిన ప్యాపిలి వైఎస్సార్‌సీపీ కార్యకర్త జింకల పెద్దయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బేతంచెర్ల, డోన్, ప్యాపిలి ఎంపీపీలు బుగ్గన నాగభూషణంరెడ్డి, రేగటి రాజశేఖర్‌రెడ్డి, దిలిప్ చక్రవర్తి, జెడ్పీటీసీలు బద్దల రాజ్‌కుమార్, బోరెడ్డి శ్రీరాంరెడ్డి, డోన్, బేతంచెర్ల మున్సిపల్ చైర్మన్‌లు సప్తశైల రాజేష్, చలంరెడ్డి, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు పోస్టు ప్రసాద్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్‌లు బోరెడ్డి పుల్లారెడ్డి, మల్లెంపల్లె రామచంద్రుడు, వ్యవసాయ సలహామండలి మాజీ చైర్మన్ మెట్టు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య



మాదిగ గిరిబాబు (ఫైల్)

కృష్ణగిరి: బ్యాంకులో తీసుకున్న అప్పు కట్టాలని నోటీసు పంపించడంతో మనోవేదనకు గురైన ఓ రైతు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు.. తొగర్చేడు గ్రామానికి చెందిన మాదిగ గిరిబాబు(46), మేరీ దంపతులకు నలుగురు కుమార్తెలు, కుమారుడు సంతానం. వీరు తమకున్న 7.61 ఎకరాల పొలాన్ని సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. గిరిబాబు 2021లో మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ప్రమాదానికి గురి కావడంతో కాలు, చేయి విరిగింది. దీంతో వ్యవసాయ పనులు చేయలేక ఉన్న పొలాన్ని అదే గ్రామానికి చెందిన వ్యక్తికి కౌలుకు ఇచ్చాడు. పిల్లల చదువు, కుటుంబ ఖర్చుల నిమిత్తం ఉన్న పొలాన్ని 2022లో కేడీసీసీ బ్యాంకు డోన్ బ్రాంచిలో పెట్టి రూ.15 లక్షల లోన్ తీసుకున్నాడు. ఇటీవల బ్యాంకు వారు ఆ అప్పు కట్టమని నోటీసు పంపించడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 8న ఉదయం భార్య కూలీ పనులకు వెళ్లిన తర్వాత ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసిన భార్య వెంటనే ఇరుగుపొరుగు వారి సాయంతో వెల్దుర్తి సీహెచ్‌సీకి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఇంటి పెద్ద మరణంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని..





బస్సు ఢీకొని మృతి చెందిన తెలుగు వెంకటేష్

గోనెగండ్ల: మండల పరిధిలోని గాజులదిన్నె ప్రాజెక్టు స్టేజ్ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. శనివారం ఈ సంఘటన జరిగింది. సీఐ గంగాధర్ తెలిపిన వివరాల మేరకు.. సి. బెళగల్ మండలం ఇనగండ్ల గ్రామానికి చెందిన తెలుగు వెంకటేష్(49)కు భార్య అంజినమ్మ ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మృతుడు వెంకటేష్ కొన్ని మాసాలుగా దేవనకొండ మండలం కోటకొండ గ్రామం మామిడి తోటలో దినసరి కూలీగా పని చేస్తున్నాడు. గురువారం రాత్రి తన స్వగ్రామమైన ఇనగండ్లకు వెళ్లాడు. అక్కడ తన కుటుంబ పనులు ముగించుకొని శనివారం ఉదయం స్వగ్రామం నుంచి తిరిగి కోటకొండకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. గాజులదిన్నె ప్రాజెక్టు స్టేజ్ సమీపంలోని ఎల్లెల్సీ కాలువ దగ్గర రోడ్డు దాటుతుండగా ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు (ఏపీ 21 జెడ్ 0564) అతి వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన వెంకటేష్ 108 అంబులెన్స్‌లో కోడుమూరు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు తెలుగు బడేసాబ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపాడు.

పోలీసుల అదుపులో బోరుగడ్డ అనిల్‌కుమార్

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాకు చెందిన బోరుగడ్డ అనిల్ కుమార్‌ను శనివారం కర్నూలు మూడో పట్టణ పోలీసులు విచారిస్తున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న ఆయనను కర్నూలుకు చెందిన ఐ టీడీపీకి చెందిన కొంత మంది బోరుగడ్డ అనిల్‌పై మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్‌పై ఆయన అనుచితమైన పోస్టులు పెట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో 2022 సంవత్సరంలో ఆయనపై కేసు నమోదు చేశారు. తాజాగా ఆయనపై పిటీ వారెంట్ తీసుకున్న కర్నూలు పోలీసులు మూడో పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. మూడు రోజుల పాటు పోలీసుల అదుపులో ఉంటాడని పోలీసులు వెల్లడించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం



రమేష్ నాయక్ (ఫైల్)

బేతంచెర్ల: జిల్లాలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డుప్రమాదాల్లో ఒకే రోజు ముగ్గురు దుర్మరణం చెందారు. గుర్తు తెలియని వాహనాలు ఢీకొన్న ఘటనల్లో ఇద్దరు మృతిచెందగా.. కుక్కను తప్పించేక్రమంలో స్కూటీ అదుపు తప్పిన ప్రమాదంలో మరొకరు మృతిచెందారు. పాణ్యం మండలం తమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన రమేష్ నాయక్ (25) వారం క్రితం స్కూటీ కొన్నాడు. శనివారం స్కూటీపై తమ ఇంటి దేవుడు మద్దిలేటి స్వామిని దర్శించుకుని, స్కూటీకి పూజలు చేయించుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. సిమెంట్ నగర్ గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం స్కూటీని ఢీకొంది. ప్రమాదంలో రమేష్ నాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని భార్య దేవిబాయి ప్రస్తుతం గర్భిణి కాగా ఇప్పటికే ఏడాది వయస్సు ఉన్న రిషిక బాయి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుక్కను తప్పించబోయి..

డోన్ టౌన్: కర్నూలు గణేష్ నగర్‌కు చెందిన గంగాధర్ చలపతి(40) ఈనెల 8న స్నేహితుడు సుమ్మన్నతో కలిసి వ్యక్తిగత పనుల నిమిత్తం డోన్‌కు వచ్చారు. రాత్రి తిరిగి వెళ్లే సమయంలో జాతీయ రహదారిపై వెంకటాపురం సర్కిల్‌లోని ఫ్లైవర్ బ్రిడ్జి సమీపంలో అడ్డంగా వచ్చిన కుక్కను తప్పించే క్రమంలో అదుపు తప్పి కింద పడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చలపతిని డోన్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు సీఐ ఇంతియాజ్‌బాషా శనివారం తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వెస్ట్ బెంగాల్ యువకుడు..



మృతి చెందిన సంజిత్ టర్కి

నందికొట్కూరు: వెస్ట్ బెంగాల్‌కు చెందిన సంజిత్ టర్కి(30)తో పాటు మరికొందరు నేషనల్ హైవే పనులు చేసేందుకు వలస కూలీలుగా శుక్రవారం నందికొట్కూరు వచ్చారు. వీరికి ఆత్మకూరు రోడ్డులోని రబ్బానీ వేర్ హౌస్ సమీపంలో నివాసం ఉండేందుకు ఏర్పాట్లు చేశారు. అర్ధరాత్రి సంజిత్ టర్కిని మార్కెట్ యార్డు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో శరీరం రెండు భాగాలుగా విడిపోయి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుని స్నేహితుడు ప్రదీప్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రామచంద్రుడు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు, భార్య ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కాంట్రాక్టర్ సందీప్‌కు అప్పగించగా అతడు వెస్ట్ బెంగాల్‌కు తరలించాడు.

విద్య ప్రైవేటీకరణను అడ్డుకోవాలి



గూడూరులో యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభల ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కోడుమూరు రూరల్ : విద్యను ప్రైవేటీకరణ చేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అడ్డుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం గూడూరులో ఆ యూనియన్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, ఉపాధ్యాయులు గూడూరు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాఠశాల విద్య బలోపేతానికి ప్రభుత్వం బడ్జెట్లో 30 శాతం నిధులు కేటాయించాలన్నారు. అలాగే పిల్లలు లేరని పాఠశాలలను మూసివేయరాదన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు పంపావతి, భాస్కర్‌బాబు, సురేష్‌కుమార్, ఇందిరా సుభాషిణి, దావీదు, హేమంత్‌కుమార్, కాంతారావు, షబ్బీర్, మనోజ్, హనుమన్న, కిశోర్, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

14 అడుగుల కొండ చిలువ



శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట 132/11కె.వి విద్యుత్‌సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి 14 అడుగుల కొండ చిలువ కనిపించడంతో సబ్‌స్టేషన్ సిబ్బంది భయాందోళన చెందారు. అటవీ అధికారులకు సమాచారం అందించడంతో సబ్–డీఎఫ్‌ఓ షేక్ మహమ్మద్ అబ్దుల్‌రవూఫ్, సిబ్బంది ఆలీ, స్నేక్‌క్యాచర్ కాళీచరణ్ అక్కడికి చేరుకుని కొండ చిలువను పట్టుకొని సురక్షితంగా అడవిలోకి వదిలేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కైరుప్పలలో అగ్నిప్రమాదం

- రూ. 4లక్షల ఆస్తి నష్టం



కాలిపోయిన పత్తి

ఆస్పరి: కైరుప్పల గ్రామంలోని ఓ ఇంట్లో శనివారం గ్యాస్ లీకై మంటలు చెలరేగిన సంఘటనలో రూ. 4 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. రైతు పక్కీర ప్ప ఇంట్లో శనివారం గ్యాస్ అయిపోయింది. దీంతో ఆయన పాత సిలిండర్‌ను తీసి నిండు సిలిండర్‌ను అమర్చాడు. తర్వాత స్టవ్‌ను వెలిగించగా రెగ్యులేటర్ నుంచి గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. గమనించేలోపు పక్కనే ఉన్న పత్తికి మంటలు వ్యాపించాయి. వెంటనే ఇరుగుపొరుగు వారి సాయంతో వాటిని అదుపుచేసేందుకు బక్కెట్లతో నీళ్లు పోశారు. అదే సమయంలో కొంత మంది యువకులు ఇంట్లోకి వెళ్లి సిలిండర్‌ను బయటకు తెచ్చారు. అయినా, పత్తికి అంటుకున్న మంటలు అదుపులోకి రాకపోవడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న 30 క్వింటాళ్ల పత్తి, టీవీ, బీరువాలోని రూ. 30వేలు నగదు, తిండి గింజలు, 2 క్వింటాళ్ల ఎండు మిరపకాయలు, బట్టలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. దాదాపు రూ. 4లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. వీఆర్‌ఓ ఈరన్న ప్రమాద స్థలికి చేరుకుని నష్టం వివరాలను అంచనా వేసి తహసీల్దార్‌కు నివేదిక ఇస్తానని చెప్పారు.

అఘోరీ ఆలయాల సందర్శన



యాగంటి నందీశ్వరుడుకి పూజలు చేస్తున్న అఘోరీ నాగసాధువు

బనగానపల్లె రూరల్/మహానంది/పాణ్యం: యాగంటి, మహానంది క్షేత్రాలను అఘోరీ నాగసాధువు శనివారం సందర్శించారు. తెల్లవారు జామున 4 గంటలకు యాగంటి ఆలయంలోని ఏకశిలారూపంలో కొలువైన శివపార్వతులకు, పెద్ద పుష్కరణి వద్ద ఉన్న నందీశ్వరుడికి పూజలు చేశారు. అక్కడి నుంచి మహానంది క్షేత్రానికి చేరుకుని కామేశ్వరీదేవి సహిత, మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు. ఆయా ఆలయాల వద్ద అఘోరీ మాట్లాడుతూ సనాతనధర్మ రక్షణ, గో హత్య నిర్మూలన, ఆలయాల ధ్వంసం అరికట్టాలనే ఉద్దేశంతోనే తాను తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ ఆలయాలను దర్శించుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం కర్నూలు బయలుదేరారు మార్గమధ్యలో పాణ్యం సమీపంలో వాహనం మొరాయించడంతో కాలినడకన ప్రయాణం సాగించారు. ఈసందర్భంగా అఘోరీని చూసేందుకు ప్రజలు ఎగబడ్డారు. ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని తమ వాహనాల్లో డ్రాప్ చేస్తామని పాణ్యం ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, హైవే పెట్రోల్ సిబ్బంది కోరినా అఘోరీ తిరస్కరించారు.